ప్రజాశక్తి
గురువారం 8 డిసెంబర్ 2022 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



సిఎం పర్యటన ఏర్పాట్లపై మద్దిశెట్టి శ్రీధర్‌తో మాట్లాడుతున్న ఎస్‌పి మల్లికగర్గ్

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరుకానున్న జగన్‌మోహన్‌రెడ్డి
- భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి ఎస్‌పి మల్లికగర్గ్ సూచనలు

ప్రజాశక్తి-దర్శి

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుడు రాజీవ్ వివాహ రిసెప్షన్ ఈ నెల15వ తేదీన దర్శిలో జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ ముఖ్యమంత్రి రాక సందర్భంగా భద్రత, బందోబస్తు, బారికేడ్ల ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, సీఎం కాన్వాయ్ రూట్, రిసెప్షన్ వేదిక మరియు ఇతర అంశాలపై పోలీసు అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కురిచేడు రోడ్డులోని కేశర శ్రీనివాసరెడ్డి వెంచర్‌లోని రిసెప్షన్ ప్రాంతాన్ని, శివరాజ్ నగర్‌లోని హెలీప్యాడ్ ఏరియా వద్ద భద్రతా ఏర్పాట్లను, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు, బారికేడ్లలను ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. రిసెప్షన్‌కు వచ్చే వివిఐపిలు, విఐపిలు మరియు ప్రజల కోసం ఏర్పాటు చేసిన వేరువేరు స్థలాలను ఎస్పీ పరిశీలించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, దర్శి డిఎస్పీ నారాయణస్వామిరెడ్డి, డిఎస్‌బి డీఎస్పీ బి.మరియదాసు, దర్శి సిఐ రామకోటయ్య, పొదిలి సిఐ సుధాకర్, త్రిపురాంతకం సిఐ యం.రాంబాబు, దర్శి ఎస్ఐ రామకష్ణ ఉన్నారు.

భవిష్యత్‌పై మథనం



- నేడు వైసిపి జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలతో సిఎం భేటీ
- హాజరుకానున్న అధ్యక్షుడు జంకె, బాలినేని, జిల్లా సమన్వయకర్తలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికల వ్యూహాలు మొదలయ్యాయి. భవిష్యత్‌పై ఏం చేయాలనే దానిపై పార్టీల్లో తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఎన్నికల సమయం సమీపిస్తున్నందున రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు, పొత్తులపై చర్చలు సాగుతున్నాయి. సామాజిక సమీకరణలపైనా కేంద్రీకరించారు. పార్టీల అధినేతలు జిల్లా నేతలతో భేటీలు పెంచారు. ఇటీవల వరకూ సిఎం జగన్ గడపగడపకూ కార్యక్రమంపైనే రెండు దఫాలుగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలతో సమావేశాలు నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లాల్సిందేనని ఆదేశించారు. దీంతో సీనియర్ నేతలు కూడా అనివార్యంగా నెలకు 16 రోజుల పాటు నియోజకవర్గాల్లో తిరగాల్సి వచ్చింది. ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు సిఎం జగన్ కీలక నేతలతో గురువారం నాడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

తాడేపల్లిలో జరిగే ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో పాటు నెల్లూరు, కడప, తిరుపతి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు కో ఆర్డినేటర్లుగా ఉన్న బీదా మస్తాన్, భూమన కరుణాకర్‌రెడ్డితో పాటు నియోజకవర్గ పరిశీలకులు హాజరుకానున్నారు. ఎజెండా ఏమిటన్నదీ ఇంకా స్పష్టంగా జిల్లా నేతలకు ఇవ్వలేదు. పార్టీ స్థితిగతులు, ఎమ్మెల్యేలపై ఉన్న పరిస్థితి, వ్యతిరేకతలు, అనుకూలతలతో పాటు టిక్కెట్ల వ్యవహారంపైనా చర్చ సాగే అవకాశం ఉంది. ఏం చేయాలనే దానిపైనే మథనం ఉంటుందని చెబుతున్నారు. రానున్న ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకునే వ్యూహమే ఇక్కడ చర్చకు అవకాశం ఉంటుందనేది స్పష్టంగా తెలుస్తోంది. జిల్లాలో పార్టీ పరిస్థితితో పాటు సిట్టింగులకు తిరిగి టిక్కెట్లు ఇచ్చే విషయం, వ్యతిరేకత ఉన్నవారిని తప్పించే అంశాలూ ప్రాథమికంగా చర్చకు వస్తాయా? లేదా? అనేదీ చూడాలి. అయితే జిల్లా నేతలు, కో ఆర్డినేటర్లు మాత్రం నియోజకవర్గాల్లో పరిస్థితిపై నివేదికలు ఇచ్చే అవకాశం ఉంది. జిల్లాల వారీగా చర్చకు వచ్చినప్పుడు ఏ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఎలా ఉంది? ఎమ్మెల్యేల గ్రాఫ్ ఎలా ఉందనేది చర్చకు వచ్చినపుడు వారి పరిశీలన మేరకు అక్కడ నివేదించనున్నారు. ప్రస్తుతం జిల్లా పునర్విభజన జరిగాక 8 నియోజకవర్గాలే అయ్యాయి. బాపట్ల జిల్లాకు మూడు నియోజకవర్గాలు పోగా నెల్లూరుకు కందుకూరు వెళ్లింది. జిల్లాలో చూస్తే వైసిపిలో గత ఎన్నికల నాటి పరిస్థితైతే మాత్రం కనిపించడం లేదు. అన్ని నియోజకవర్గాల్లో ఏదో తరహా సమస్యలు వెంటాడుతున్నాయి. పార్టీలో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా వర్గాలు, గ్రూపులు ముందుకు వచ్చాయి. సిట్టింగులకు వ్యతిరేకంగా ఆందోళనలు కూడా తెరపైకి వచ్చాయంటే ఐక్యత ఎలా ఉందో విదితమవుతోంది. ఒంగోలులో మినహా అన్ని నియోజకవర్గాల్లో సిట్టింగులకు పోటాపోటీగా టిక్కెట్లు ఆశించే నేతలు పెరిగారు. కారణం అక్కడ పార్టీలో పరిస్థితులేనంటున్నారు. పశ్చిమాన చూస్తే గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వ్యతిరేకంగా పార్టీ నేతలే ఇటీవల వరకూ అసమ్మతివర్గంగా మారారు. బాలినేనితో భేటీ తర్వాత గడపగడపకూ కార్యక్రమం కొనసాగుతోంది. అయితే అక్కడ టిక్కెట్టు విషయంపై స్పష్టత లేదు. ద్వితీయశ్రేణి నేతలు భవిష్యత్‌లో ఎమ్మెల్యే అన్నాకు అనుకూలంగా ఏమేరకు ఉంటారనేది చూడాలి. మార్కాపురంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి పోటీగా ఇతరులు ప్రయత్నాల్లో ఉన్నారు. ఆయనపైనా పలు రకాల చర్చలు వస్తున్నాయి. ఆయన చుట్టూ ఉన్న కోటరీతోనే సమస్యలు ▶ 2లో

మిర్చి తోటలకు

ట్యాంకర్ల నీరే ఆధారం

- భారంగా మారిన పెట్టుబడులు
- ఆందోళన చెందుతున్న రైతులు



ట్యాంకర్ ద్వారా మిర్చి పంటకు నీరు పెడుతున్న రైతు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఖరీఫ్ పంటల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. మిర్చి తోటలు కీలకమైన పంట దశలో వర్షాలు ముఖం చాటేయడంతో వాడుముఖం పట్టాయి. నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో కలిపి ఈ ఏడాది 23,800 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో మిర్చి తోటలు సాగు చేశారు. కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడుల రూపంలో ఖర్చు చేశారు. తోటలు ఏపుగా పెరిగాయి. పూత, పిందెలతో కళకళలాడుతున్నాయి. అంతలోనే భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వ్యవసాయ బోర్లు ఒట్టిపోయాయి. వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో మిర్చి తోటలను రక్షించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సుమారు మూడు వేల ఎకరాల్లో మిరప తోటలను పశువులకు వదిలేశారు. అయితే వచ్చిన కాపును నిలబెట్టేకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.

ఎకరానికి ఎనిమిది ట్యాంకర్ల నీరు..

వచ్చిన పూత, పిందెను కాపాడుకునేందుకు మిర్చి రైతులు నానా పాట్లు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకొని తోటలను బతికించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్కో ట్యాంకరు నీటిని రూ.వెయ్యికి కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు ఎనిమిది ట్యాంకర్లు చొప్పున కొనుగోలు చేసి తోటలను తడుపుతున్నారు. వారం, పది రోజుల్లో వర్షాలు కురవక పోతే పడ్డ కష్టమంతా వృథా అవుతుందని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యి అడుగులు తవ్వినా..

మిర్చి పంటలను కాపాడేందుకు రైతులు వెయ్యి అడుగులకు పైగా బోర్లు తవ్విస్తున్నారు. మిర్చి పంటలు వేసిన రైతులు పంటలు కాపాడుకునే ప్రయత్నంలో రూ.లక్షలు ఖర్చుచేసి బోర్లు వేయిస్తున్నా నీటి జాడ కనిపించడం లేదు. గరిష్టంగా 1,200 అడుగుల లోతుకు వెళ్తున్నారు. అయినా నిరాశే మిగులుతోందని అన్నదాతలు వాపోతున్నారు. ఒక బోరు వేయించాలంటే ప్రస్తుత రేట్లను బట్టి రూ. 1.50 లక్షల దాకా ఖర్చవుతుందని వాపోతున్నారు. పెంచిన తోటలను కాపాడుకునేందుకు అప్పులు చేస్తున్నారు. భార్యల మెడల్లోని పుస్తెలను సైతం తాకట్టు ▶ 2లో

తుపాను పట్ల

అప్రమత్తంగా ఉండాలి

టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



కొత్తపట్నంలో పరిశీలిస్తున్న తహశీల్దార్ రామారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపాన్‌గా బలపడింది. రానున్న 2-3 రోజులలో దక్షిణ కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ బుధవారం తీర ప్రాంత మండలాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

కొత్తపట్నంలో తహశీల్దార్ పరిశీలన

కొత్తపట్నం: తుఫాన్ ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొత్తపట్నం తహశీల్దార్ బివి.రామారావు తెలిపారు. బుధవారం కొత్తపట్నం బీచ్‌ను తహశీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తుఫాన్ షెల్టర్‌ను ఆశ్రయంగా తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌పై మథనం

(మొదటిపేజీ తరువాయి)

తెరపైకి వచ్చాయంటున్నారు. ఇక్కడ పోటీకి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి గట్టి సన్నాహాల్లో ఉన్నారు. మరో యువనేత పెద్దిరెడ్డి సూర్యప్రకాశరెడ్డి కూడా టిక్కెట్టు యత్నాలు చేస్తున్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌కు వ్యతిరేకంగానూ స్థానిక నేతలు వ్యవహారాలు చేస్తున్నారు. దర్శిలో ఎమ్మెల్యే మద్దిశెట్టి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మధ్య గ్రూపు పోరు నడుస్తోంది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయుడూ ఇక్కడ టిక్కెట్టుపై ధీమాతో ఉన్నారు. ఇక్కడ ఎవరికి టిక్కెట్టు అనేదీ స్పష్టత రావాల్సి ఉంది. కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌కు వ్యతిరేకంగా బలమైన సామాజికవర్గం వేరుకుంపటి పెట్టి రాజకీయాలు నడుపుతున్నారు. కొండపిలోనూ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ మాదాసి వెంకయ్యలు రెండు వర్గాలుగానే ఉన్నారు. నేతలూ చీలారు. ఇక్కడా సమన్వయం ఎండమావిగానే ఉంది. సంతనూతలపాడులో ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు వ్యతిరేకంగా మండలస్థాయి ప్రజాప్రతినిధులు తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఆయనపైనే ఇక్కడ పెత్తనం చేస్తున్నారు. ఒంగోలులోనూ బాలినేనికి వ్యతిరేకంగా సొంతపార్టీ నేతలే వ్యతిరేక ప్రచారాలు పెట్టారు. ఆయన గట్టిగా వార్నింగులు ఇవ్వడంతో సర్దుకున్నారు. టిక్కెట్టు విషయంలో ఒంగోలులో బాలినేనికి తప్ప మిగతా వారిలో ఎంతమందికి గ్యారంటీగా వస్తాయనేదీ స్పష్టత లేదు. మార్పులు భారీగానే ఉంటాయనే చర్చలు సాగుతున్నాయి. అయితే ఎన్నికల నాటికి ఈ మార్పులు ఉంటాయా? లేక త్వరలోనే చేపడతారా? అనేదీ వేచి చూడాల్సిందే.



కణితిని చంపిన వ్యక్తులు

కణితిని చంపిన వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి - గిద్దలూరు

కణితిని చంపిన వ్యక్తులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.స్థానిక అటవీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన గుండ్లమోటు వాగు ప్రేదేశంలో కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అటవీశాఖ అధికారులు వెంబడించి వారి వద్ద నుంచి నాటు తుపాకీ, కణితి చర్మం, తల, కాళ్ళు, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. వెంబడించిన వారిలో ఏడుగురిని పట్టుకొనగా, ఇద్దరు తప్పించుకున్నట్లు ఆయన తెలిపారు.



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

పులి వెంకటరెడ్డి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కనిగిరి

స్వర్గీయ కేంద్రకార్మికశాఖ మాజీ మంత్రి పులి వెంకటరెడ్డి తన పదవీ కాలంలో అందించిన సేవలు ప్రశంసనీయమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ కొనియాడారు. బుధవారం పులి వెంకటరెడ్డి 22వర్ధంతి కార్యక్రమంను పట్టణంలోని పులి వెంకటరెడ్డి పార్కులో నిర్వహించారు. ఈసందర్భంగా పులివెంకటరెడ్డి విగ్రహానికి షేక్ గఫార్ పూలమాల వేసి నివాళుర్పించారు. వెలిగండ్ల సమితిఅధ్యక్షులుగా రెండు సార్లు, ఎమ్మెల్యేగా మూడుసార్లు,కార్మిక శాఖమంత్రిగా పనిచేసి వెనుకబడిన కనిగిరి ప్రాంతానికి ఆయన ఎంతో కృషిచేశారన్నారు. ఆయనతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ రెడ్డి దంపతులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాస్మోపాలిటన్‌క్లబ్ సభ్యులు పులి లక్ష్మీ,17వవార్డు కౌన్సిలర్ దేవకి రాజీవ్,పులి నాగేంద్ర, ముత్యాలశ్రీను, దొనపాటిమహేష్,చిలకల శ్రీను,అల్లూరి సత్యనారాయణ,చెక్క బాలకృష్ణ, నాయబ్‌రసూల్, రుద్ర, సందాని,భారత్ గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడులో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-పెద్దారవీడు



ఎండ్ల పోటీల దృశ్యం

మండలంలోని దేవరాజుగట్టులోని కాశీ నాయన ఆరాధన మహోత్సవము సంద ర్భంగా ఆరుపండ్ల పశుప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా పొట్లపాడు గ్రామానికి చెందిన పాలెం వెంకటేశ్వరరెడ్డి ఎడ్ల జత 4వేల అడుగులు లాగి ప్రధమ స్థానంలో నిలిచి రూ.25,116 లను కైవసం కేసుకున్నారు. ఈ బహుమతిని జవ్వాజి వెంకటరంగారెడ్డి, జవ్వాజి లోకనాధరెడ్డిలు అందజేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజాస్వారరెడ్డి ఎడ్ల జత 3857 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.20,116 లను కైవసం చేసుకున్నాయి. ఈ బహుమతిని బట్టగిరి లక్ష్మీరెడ్డి, మారంరెడ్డి పెద్దవెంకటరెడ్డి, బద్దిగం వెంకటేశ్వరరెడ్డిలు అందజేశారు. పల్నాడు జిల్లా మత్తుకుమల్లి గ్రామానికి చెందిన ముంద్ర జీవప్రాసద్ ఎడ్ల జత 3600 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.15,116లను కైవసం చేసుకు న్నాయి. ఈ బహుమతిని దండా వెంకటే శ్వరరెడ్డి అందజేశారు. నంద్యాల జిల్లా తుములూరు గ్రామినికి చెందిన పల్లవి, ప్రకాశం జిల్లా ఎర్రబాలెం గ్రామానికి చెందిన హేమలత నాయుడు ఎడ్ల జత 3226అడుగులు లాగి చతుర్ధ స్థానంలో నిలిచి రూ.10,116లను కైవసం చేసుకు న్నాయి. ఈ బహుమతిని దండా జగన్‌రెడ్డి అందజేశారు. ప్రకాశం జిల్లా కొత్తపల్లికి చెందిన వెంకటరెడ్డి, పెద్దారవీడుకు చెందిన సిద్దయ్యల ఎడ్ల జత 2507.08 అడుగులు లాగి పంచమ బహుమతి రూ.5,116లను కైవసం చేసుకున్నాయి. ఈ బహుమతిని బొగ్గు రవిచెన్నారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల పోటీల నిర్వహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కొత్తపేట ఎమ్మెల్యే జంగారెడ్డి చేస్తున్న పాదయాత్రకు మార్కాపురం శాసనసభ్యుడు కుందురు నాగార్జునరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్‌రెడ్డిలు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే జంగారెడ్డి తిరుపతి నుండి శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానం వరకు చేపట్టిన పాదయాత్రలో ఆయనను కలిసి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డిలు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, రేగడిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ ఎస్సీ సెల్ సభ్యులు సిరుకూరి కోటేశ్వరరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కాశిరెడ్డి, నాయకులు పెద్దవెంకటరెడ్డి, మంచికల కోటేశ్వరరావు, ఎంఆర్‌ఎఫ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మందలపు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి-కొనకనమిట్ల

నాడు-నేడు పనులపై స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రావూరి జనార్దన్‌రావు మాట్లాడుతూ నాడు-నేడు కింద మంజూరైన పనులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సకాలంలో పూర్తి చేయని నిధులను మరొక పాఠశాలకు బదిలీ చేయటం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఉదయం 9:30లకు బయోమెట్రిక్ వేయాలని సూచించారు. ఎంఇఓ ఎస్‌కె డాంగేషరీఫ్ పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం కె.గోపాలకష్ణారెడ్డి, పాల్గొన్నారు.

నడిగడ్డ ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన

ప్రజాశక్తి-త్రిపురాంతకం



ఎస్ఎస్‌ట్యాంకును పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు బృందం

త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు సోమవారం గండి పడిన విషయం విధితమే. ఈ ట్యాంకు గండి దగ్గరకు బుధవారం యర్రగొండపాలెం తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పరిశీలించారు. పరిస్థితిని గురిం చి అధికారులను అడిగి తెలుసు కున్నారు. దీని మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల వలరాజు, మాజీ కన్వీనర్ మోటకట్ల శ్రీనివాసరెడ్డి, మండల సీనియర్ నాయకులు దేవినేని చలమయ్య, ఆళ్ళ నాసర్ రెడ్డి, దుదిపల్లి రైతు నాయకులు పాల్గొన్నారు.

మిర్చి తోటలకు ట్యాంకర్ల నీరే ఆధారం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టి బోర్లు వేయిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోని అమానుగుడిపాడులో వంద బోర్లు దాకా వేయించారు. వాటిలో పది బోర్లలో మాత్రమే అరకొరగా నీళ్లు పడ్డాయి. ఇదే పరిస్థితి అన్ని గ్రామాల్లో నెలకొంది.

పంటలన్నీ బెట్టకొచ్చాయి

కైపు వెంకట కోటిరెడ్డి, రైతు, మురారిపల్లి

ఈ ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి తోటను సాగు చేశా.. వర్షం జాడ లేకపోవడంతో మిర్చి తోట బెట్టకొచ్చింది. అరకొరగా వస్తున్న పూత, పిందె రాలిపోతున్నాయి. బోర్ల ద్వారా నీటి తడులు పెట్టాలనుకుంటే భూగర్భ జలాలు ఇంకిపోయాయి. 1200 అడుగుల లోతుకు బోర్లు వేసినా చుక్కనీరు పడటం లేదు. దీంతో ఈ ఏడాది రైతాంగం నిలువునా నష్టపోయింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ఈ ఏడాది రైతాంగానికి కాలం కలిసి రాలేదు. సకాలంలో వర్షాలు కురవక పంటలన్నీ బెట్టకొచ్చాయి. ట్యాంకర్ల ద్వారా నీటిని తోలి పంటలను బతికించుకోవాలన్నా నీరు దొరికే పరిస్థితి లేదు. పెట్టుబడుల రూపంలో రైతులు వేలాది రూపాయలు నష్టపోయారు. గత ప్రభుత్వంలో బత్తాయి తోటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకుంటే ప్రభుత్వం రైతులకు నీటి తడుల బిల్లులు ఇచ్చింది. ఈ ఏడాది కూడా మిరప తోటలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకుంటున్న రైతులకు బిల్లులు చెల్లించాలి. ఈ పాటికే నష్టపోయిన పంటలను సర్వే చేయించిన నష్టపరిహారం అందించాలి.

పంటలు అమ్మే సమయానికి ధర తగ్గిస్తున్నారు

- మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

- కల్లాల్లో వరి ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి- వేమూరు

రైతులు ఆరుకాలం కష్టపడి ధాన్యం పండిచినా తీరా అమ్మే సమ యానికి ధరలు తగ్గిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్లాలలోని వరిధాన్యాన్ని నక్కా ఆనంద్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వ్యవసాయ రంగం కుదేలు అయినట్లు తెలిపారు. రైతలకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు దగా కేంద్రాలుగా మారాయన్నారు.కష్ణ పశ్చిమ డెల్టా ప్రాంతంలో వరి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పట్టించిన పంటలకు కనీస మద్దతు ధరలేవని తెలిపారు. దళారులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోతున్నారన్నారు. కల్లాల వద్దకే వచ్చి దాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పి ఆ విధంగా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్షలో ఉన్నప్పుడు తాను రైతుల పక్షపాతిని,ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంత్రులు మాటలకు, ముఖ్యమంత్రి మాటలకు పొంతన ఉండటం లేదన్నారు. దళారులు రైతులను అడ్డగోలుగా ధరలు తగిచ్చి రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. పంటలు బాగా పండించినప్పటికీ రైతు మొహంలో ఆనందం ఉండటం లేదన్నారు. కౌలు రైతులు పరిస్థితి మరీ దారు ణంగా ఉందన్నారు.రైతులకు నష్టం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లూరు

కొల్లూరులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహ శీల్దారు శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రైతులు తమ పంటను కనీస మద్దతు ధర కన్నా తకువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. దళారులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుడదని రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు రైతులు ధాన్యాన్ని విక్రయనిచు కోవాలన్నారు. ఎఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరి ధాన్యం సాధారణ రకం 75 కేజీలు రూ.1,530 రూపాయలు, ఏ గ్రేడ్ రకం రూ.1,545 ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. తేమశాతం 17.0 , వ్యర్థ పదార్థాలు, మట్టి,రాళ్ళు 1.0శాతం, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన పురుగు తిన్న ధాన్యం 5.0 శాతానికి మించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు విక్రయించిన ధాన్యం, వాటి విలువ తదితర వివరాలతో రశీదు కొనుగోలు సమయంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు వారిలో ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దారు

అంగన్‌వాడీల ర్యాలీ

ప్రజాశక్తి-పర్చూరు

అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్స వం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుభద్ర మాట్లాడుతూ నవంబర్ 26 నుంచి డిసెంబర్ 10 పక్షోత్సవాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం మరియు మహిళలు పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళలకు రక్షణ కల్పించే విధంగా చట్టం రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నెహ్రూ బాబు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వేటపాలెం : బాల్య వివాహాలతో కష్టాలు, నష్టాలు కలుగుతాయని సిడిపిఒ కె.ఉమ తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషేదం, పరిహారంపై ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ నవంబర్ 25 నుంచి డిశంబర్ 10 వరకూ జిల్లా మహిళా,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతికి 18, యువకుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపిం చాలన్నారు. తొలుత మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యాక్ర మంలో ఎంపిడిఒ శర్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వాణిశ్రీ, పుష్పవల్లి ,లీలావతి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శివాలయ భూమిపై విచారణ

రికార్డులు పరిశీలించిన అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు

ప్రజాశక్తి చీరాల

శివాలయానికి సంధిం చిన స్థలాన్ని మరొకరి పేరుపైతో మార్పు చేసిన చీరాల దేవాదాయ శాఖ మేనేజర్ తుపాకుల శివనాగదాసు చర్యలపై సమగ్ర విచారణ జరిపించాలని చీరాల శివాలయం అడ్ హాక్ కమిటీ ప్రతినిధులు క్షీరపురి హిందూ ధర్మ పరిరక్షణ ప్రతినిధులు విజయవాడలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ బాపట జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎం. పానకాలరావు బుధవారం విచారణ జరిపారు. శివాలయ అడ్ హక్ కమిటీ ప్రతినిధుల నుంచి వివరాలు నమోదు చేశారు. చీరాల శివాలయానికి సంబంధించిన భూములు, ఇతర దస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. మేనేజర్ శివనాగదాసు ను వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పానకాలరావు మాట్లాడుతూ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు విచారణ చేసినట్లు చెప్పారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.వారి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసు కుంటామని చెప్పారు. ఈ కార్యరకమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఎండోమెంట్ అధికారులు జివిఎల్.కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న అసిస్టెంట్ కమిషనర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

యోహానుకు ఎమ్మెల్యే స్వామి నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని మర్లపాడు గ్రామానికి చెందిన టిడిపి మండల నాయకుడు అంగలకుర్తి యోహాను దశ దినకర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని యోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామ పార్టీ నాయకులతో స్థానిక విషయాలపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో మర్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్తినేని హరిబాబు. తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కొమ్ము వెంకట్రావు, టిడిపి ఎస్‌సి మండల సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి లింగాల బాలకోటయ్య, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మురళీ కృష్ణ

బైకు దొంగలు అరెస్టు

రూ.2.5 లక్షల విలువైన ఐదు బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-రేపల్లె

నలుగురు బైక్ దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల విలువైన 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి మురళీకష్ణ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... పట్టణంలోని పెనుముడి చెక్ పోస్ట్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సయంలో నలుగురు యువ కులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచా రించారు. తాము బైకులను చోరీ చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. పట్టణ పరిసరాల్లో 3 బైకులు, నిజంపట్నం, కొల్లూరు మండలంలో రెండు బైకులు చోరీ చేసినట్లు నిందితులు తెనాలికి చెందిన మహమ్మద్ అబ్దుల్ సమీర్, రేపల్లెకు చెందిన పీత వెంకటేష్, గరికపాటి భవాని ప్రసాద్ , పీత రవితేజ ఒప్పుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్ల సిఐ విజయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ విజయ చంద్ర, ఎస్ఐ భరత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మేదరమెట్ల

జాతీయ రహదారిపై పెట్టిన జిగ్జాగ్ డ్రమ్స్‌ను బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వెంకటాపురం వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మార్టూరుకు చెందిన చక్రాల నరసింహారావు (38) మృతిచెందాడు. మృతుడు ఒంగోలు నుంచి మార్టూరు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సమాచారంతో మేదరమెట్ల ఎస్ఐ ఎంవి. శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.



కేక్ కట్ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎరిక్షన్‌బాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు కేకును కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం నిరుపేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దోర్నాల మండలం టిడిపి నాయకులు ఎరిక్షన్ శాలువలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో షేక్ మాబు, సమ్మద్‌బాషా, భట్టు సుధాకర్‌రెడ్డి, సుబ్బరత్నం, చంటి, నాగేంద్రబాబు, గోపాల్, శేషాద్రి, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, ముస్లిం నాయకులు, యువకులు, మహిళలు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నూతన వధువును ఆశీర్వదిస్తున్న బాచిన, బూచేపల్లి

వధువుకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండల పరిధిలోని ఏల్చూరు గ్రామంలో వైసిపి నాయకుడు ఒరుగంటి కోటిరెడ్డి కుమార్తె నమ్రత వివాహం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జిబాచిన కృష్ణ చైతన్య, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నూతన వధువు సమ్రతను బుధవారం ఆశీర్వదించారు. అనంతరం వెల్లలచెరువు శివాలయం వద్ద రావులపల్లి అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు ఊరట

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాం చివరి కాలంలో పనులు చేపట్టి బిల్లులు కాకుండా నిలచిపోయిన కాంట్రాక్టర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అప్పటి వరకు పలు నియోజకవర్గాల్లో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్లో రూ. 25 శాతం కన్నా తక్కువ ఉన్న వాటిని రద్దు చేసింది. పనులు మంజూరై ప్రారంభించని వాటిని రద్దు చేశారు. 25 కన్నా తక్కువగా పనులు అయిన వాటిని కూడా రద్దుల జాబితాలో చేర్చారు. 25 శాతం కన్నా ఎక్కువగా చేపట్టిన పనులను ఆన్‌లైన్‌లో చూపనందున ఆ పనుల బిల్లులు నిలచిపోయాయి. పలువురు కాంట్రాక్టర్లు కోర్టులను ఆశ్రయించారు. ఆయా కేసులను విడివిడిగా పరిశీలించిన న్యాయస్థానాలు బిల్లులు మంజూరు చేయాలని రాష్ట్రప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అధికారులు పలు పర్యాయాలు కోర్టులకు హాజరై వివరణ ఇవ్వాల్సి వచ్చింది. పదేపదే కోర్టుల్లో కేసులు దాఖలవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పనులకు చెల్లించేందుకు సిద్ధపడింది. జిల్లాల వారీగా పెండింగ్‌లో నున్న 25 శాతం లోపు బిల్లులపై నివేదికలు అడగడంతో జిల్లా అధికారులు శాఖల వారీగా నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లుల వివరాలను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్‌నాయక్ ప్రభుత్వానికి పంపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 336 పనులకు గాను రూ.8.40 కోట్లు,గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా చేపట్టిన 47 పనులకు రూ.1.92 కోట్లు,గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన 16 పనులకు సంబంధించి రూ.20 లక్షలు,సర్వశిక్షా అభియాన్ ద్వారా చేపట్టిన 2 పనులకు రూ.15 లక్షల కలిపి మొత్తం రూ 10.73 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నట్లు తేలింది. ఈ నివేదికల పరిశీలన అనంతరం పెండింగ్ బిల్లులను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేయనుంది

నేడు విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి మండల పరిధిలోని వలపర్ల గ్రామంలో గురువారం విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మార్టూరు డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగారపు గురవయ్య తెలిపారు. ద్వారకపాడు, వలపర్ల గ్రామాలకు చెందిన వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఇటీవల వలపర్ల గ్రామంలో అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, పాత మీటర్లు మార్చి కొత్తగా వచ్చిన డిజిటల్ మీటర్లు బిగించాలని కోరుతూ ఎడిఎ కార్యాలయం ఎదుట సిపిఎం నాయకులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో వలపర్ల గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సమయంలో వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని డిఇఇ గురవయ్య హామీ ఇచ్చారు. అందులో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మంజుదర్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

కార్మిక సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా డిసెంబర్ 16,17 తేదీల్లో చీరాలలో నిర్వహిస్తున్న సిఐటియు బాపట్ల జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మంజుదర్ కోరారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు సిహెచ్. మణిలాల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజుందర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఎన్నికల ముందు కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికులని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ప్రభుత్వం ఏర్పడ్డాక ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగిస్తామని ప్రకటించడం దారుణమని విమర్శించారు. ఒడిషా రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు



మాట్లాడుతున్న మంజుదర్

అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్, జిల్లా నాయకులు కె.వసంతరావు, ఎం. వెంకటేశ్వర్లమ్మ, హనుమంతరావు, ప్రతాప్, జె.శ్యామ్యేలు, బుచ్చిరాజు పాల్గొన్నారు.**చీరాల :** చీరాలలో అంబేద్కర్ భవన్‌లో ఈనెల16,17 తేదీల్లో సిఐటియు బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సిఐటియు చీరాల పట్టణ అధ్యక్షుడు ఎన్. బాబూరావు తెలిపారు. జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) చీరాల



చీరాలలో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు సీనియర్ నాయకులు ఐవి. ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎండ్లూరి సింగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు చీపుర్లు, బొచ్చలు, కాలువపారలు లాంటి వస్తువులు 8 నెలలుగా ఇవ్వలేదలేని తెలిపారు. కార్మికులకు యానిఫాం, గ్లౌజులు సంవత్సరాల తరబడి ఇవ్వలేదని తెలిపారు. కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో రేగోటి వంశీ, అల్లడి కిషోర్, బిద్దిపూడి మరియమ్మ, టి.సుబ్బమ్మ, ఆంజనేయులు, కుమారి తదితరులు పాల్గొన్నారు...

గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జగనన్న గృహ నిర్మాణాల పనుల పురోగతిపై అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మెగా గ్రౌండింగ్ క్రింద గహాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులకు కేటాయించిన గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు మెప్మా నుంచి బ్యాంకు రుణాలను ఇప్పించాలన్నారు. జగనన్న లే అవుట్లలో విద్యుత్, రోడ్లు, తాగునీరు సౌకర్యాలు కల్పిం చాలన్నారు. మెప్మా అధికారుల పనితీరు బాగా లేదన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందించ డంలో నిర్లక్ష్యం చేశారని తెలిపారు. 25 జగనన్న లేఅవుట్ల కాలనీల అర్హీల పనులు ప్రారం భించాలన్నారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకం ద్వారా జిల్లాకు 16 వేల గృహాల నిర్మాణాలు లక్ష్యంగా పెట్టు కున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 7,764 గృహాలు గ్రౌండింగ్ చేసినట్లు తెలిపారు.జగనన్న కాలనీల్లో ఎంతు పెంచుకోవడానికి ప్రభుత్వం రూ. 11 కోట్ల ఒజూరు చేసినట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని గహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, బాపట్ల,చీరాల మున్సిపల్ కమిషనర్లు భాను ప్రతాప్, పి.ఏసయ్య,గహ నిర్మాణ శాఖ డిఇలు పాల్గొన్నారు.

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి. అమర్నాధ్ కోరారు. పిఆర్‌సి బకాయిలు చెల్లిం చాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2022 మార్చిలో పిఆర్‌సి బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇంతవరకూ చెల్లించలేదన్నారు. పిఆర్‌సి అమలు అనంతరం ప్రకటించాల్సిన రెండు డిఎలు కూడా ఇంతవరకూ ప్రకటించలేదని తెలిపారు. బదిలీలు,ప్రమోషన్ షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి. అమర్నాధ్ మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు డిఎ బకాయిలు జమ చేయలేదని తెలిపారు. కోవిడ్ బారిన పడిన ఉద్యోగుల మెడికల్ బిల్లుల జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.



ధర్నా ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ పివి. నాగరాజు మాట్లాడుతూ జీతాలు చెల్లింపులో జాప్యం సరికాదన్నారు. జిల్లా మైనారిటీ కన్వీనర్ నూరుబాషా సుభాని మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనకు ఆటకం కలిగిస్తున్న యాప్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి వి. ప్రభాకర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బొంత వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జి.ఉదయ్ శంకర్,షేక్ ఆదాంబి, రత్నజ్యోతి,పరిశుద్ధరావు, గుడారంకయ్య, నారాయణ, పిఎస్‌వి.ప్రసాద్, టి.శివయ్య, ఏసురత్నం, ఈమని సాంబశివరావు, మూర్తి వివిధ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్య దర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో క్రీడాకారుల శిక్షణ

పంగులూరు : ఈనెల 9,10,11వ తేదీలలో కర్నూల్ జిల్లా ఆత్మకూరులో 41వ జూనియర్ బాలుర, బాలికల అండర్ -18 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టుకు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసినట్లు కళాశాల పీడీ, ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జట్టుకు గత నెల 15 నుంచి ఇక్కడ శిక్షణ శిబిరం నిర్వహించారు.25 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకోగా చివరికి 15 మందిని జట్టుగా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్‌గా ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ కోచ్ డివిఎల్ రెడ్డి , మేనేజర్‌గా కొప్పోలు వీరాంజనేయులు వ్యవహరించనున్నట్లు ఖోఖో జిల్లా కార్యదర్శి, భవనం కాశీ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. జట్టుకు పంగులూరు వైఎస్ఆర్ స్పోర్ట్స్ వారి భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు వాయన తెలిపారు. జట్టుకు రూ.20 వేల విలువైన క్రీడా దుస్తులు అంకిరెడ్డిపాలెంకు చెందిన పిడపర్తి బ్రహ్మ రెడ్డి బహూకరించినట్లు తెలిపారు.. మాగుంట సుబ్బరామిరెడ్డి, మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, కోచ్



శిక్షణ పూర్తి చేసుకున్న అండర్ 18 ఖోఖో బాలుర జట్టు

డివిఎల్.రెడ్డి, మేనేజర్ కొప్పులు వీరాంజనేయులు, న్యాయవాది మేకల ఉషారెడ్డి క్రీడాకారులకు దుస్తులు అందజేశారు.

బాలుర జట్టు ఇదే..

బాలుర జట్టుకు పంగులూరుకు చెందిన ఆర్. సూరి నాయుడు, కె. మహేష్, ఎ. మనోహర్ కొరేశ్, జి. నాని, జి. లక్ష్మీ జీవన్‌కుమార్, పి. గోపీనాథ్, ఎం. మంత్రు నాయక్, జె. వినయ్, సిహెచ్. నాగరాజు, అమ్మనబ్రోలుకు చెందిన ఎం. షాలెం రాజు, ఎడ్లూరిపాడుకు చెందిన పి. గోపి, పుల్లలచెరువుకు చెందిన కె. వెంకటరావు, పమిడిపాడుకు చెందిన ఎం. అభినాష్, యాజిలికి చెందిన ఆర్. సుధీర్, పి. శివ గణేష్ రెడ్డి తదితరులు ఎంపికయ్యారు.



బీసీ మహాసభకు వెళ్తున్న కరణం వెంకటేష్

బీసీ మహాసభకు తరలి వెళ్లిన కరణం వెంకటేష్

ప్రజాశక్తి చీరాల

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం నిర్వహించిన బీసీ మహాసభకు వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కరణం వెంకటేష్ నాయకులతో బస్సులో విజయవాడకు తరలివెళ్లారు. బుధవారం ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద పలువురు కౌన్సిలర్లు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.



మాజీ సైనికులతో కలెక్టర్ దినేష్‌కుమార్

సాయుధ పతాక నిధికి

విరివిగా విరాళాలు ఇవ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సాయుధ పతాక నిధికి ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రధమ విరాళాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో సాయుధ బలగాలు కృషి వెలకట్టలేనిదని, సాయుధ పతాక నిధికి విరాళాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. జిల్లాలోని మాజీ సైనికుల సమస్యలు తీర్చడంలో తమ వంతు సహాయం అందిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన 20 మంది మాజీ సైనికులకు అవార్డులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారిణి ఎం రజని కుమారి, మాజీ సైనికులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలి : సిఐటియు



కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయితీ కార్మికులను వెంటనే ఆప్కాస్‌లో చేర్చి రూ.15వేలు వేతనం, హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు యం.రమేష్ డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల సమస్యలపై పొదిలి నగర పంచాయితీ ఆఫీసు వద్ద బుధవారం ధర్నా జరిగింది.ఈ ధర్నాలో రమేష్ మాట్లాడుతూ పొదిలి మేజర్ పంచాయతీ నుండి నగర పంచాయితీగా మారి 2 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా పారిశుధ్య కార్మికులకు నేటికి హెల్త్ అలవెన్స్ అమలు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఫలితంగా ప్రతి కార్మికుడు ఈకాలంలో రూ.1,60, 000లు నష్టపోయారన్నారు. హెల్త్ అలవెన్స్‌కి సంబంధం లేనీ ఆప్కాస్‌తో ముడిపెట్టి ప్రతి కార్మికుడికి రూ.6 వేలు నష్టపోవడానికి మున్సిపల్ అధికారుల బాధ్యతారాహిత్యమే కారణమన్నారు. తక్షణం కార్మికులకు రూ.15 వేలు వేతనం, హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగర పంచాయితీ పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.18,500లు వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ ఉన్న యూనిఫాం, సబ్బులు, చెప్పులు, నూనె ఇవ్వాలని, పెరిగిన జనాభా, విస్తీర్ణాన్నికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. పై సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోకుంటే డిసెంబర్ 20 నుండి విధులు బహిష్కరిస్తామన్నారు. ఈ ధర్నాలతో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పొదిలి నగర పంచాయితీ అధ్యక్ష కార్యదర్శులు జి.నాగులు, డి.సుబ్బయ్య, నాయకులు కె.వి.నరసింహం, బి.కోటేశ్వరావు, బి.హాజరత్తమ్మ, నాగేంద్రం పాల్గొన్నారు.

మదరసాకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక బిలాల్ నగర్ మెయిన్ రోడ్డు లోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ శాఖ సహకారంతో సర్వ శిక్ష అభియాన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న విద్యాసంస్థ మదరసా దీనియ పాఠశాలకు స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ ఫ్యాన్లు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు సూర్యశ్రీ వికలాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సత్తార్ బాషా మాట్లాడుతూ మదరసా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ట్రస్టు ద్వారా సమకూరుస్తానని తెలిపారు. కర్నూల్ రోడ్డు షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ పేద విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితి ఎదగాలని తల్లి దండ్రులేని విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో షేక్ అల్లా బక్ష, జడ శ్రీనివాసరావు. పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకం ఇన్‌చార్జి షేక్ జిలాని బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పించిన డాక్టర్ వెంకయ్య

మాగుంటను పరామర్శించిన మాదాసి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి బావమరిది నాగిరెడ్డి గిరిధర్‌రెడ్డి అనారోగ్యం కారణంగా చెన్నై అపోలో ఆసుపత్రిలో మతి చెందాడు. విషయం తెలుసుకున్న పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య నెల్లూరులోని గిరిధర్ రెడ్డి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అక్కడ ఉన్న ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి పరామర్శించారు.

హైకోర్టును తరలించడం సరికాదు

ప్రజాశక్తి -శింగరాయకొండ

హైకోర్టును కర్నూలు తరలించడం వైసిపి ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదని ఒంగోలు పార్లమెంటు న్యాయవిభాగం అధ్యక్షుడు సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు అన్నారు. బుధవారం నాడు ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మాణం చేపట్టి అక్కడే హైకోర్టును ఏర్పాటు చేశారన్నారు. గతంలో రాజధాని విషయంలో అనుకూలంగా ప్రవర్తించి, అధికారంలోకి వచ్చిన అనంతరం మూడు రాజధానులంటూ ప్రజలను ఇబ్బందికి గురిచేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును అమరావతిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు.

బిసి కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి

- సబ్ ప్లాన్ నిధులను వారికే ఇవ్వాలి
- కలెక్టర్‌కి టిడిపి నేతల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని 56 బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ నాయ కులు డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాత్రికేయులతో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగ తులకు గత మూడున్నర సంవత్సరాల నుండి తీవ్రమైన అన్యాయం జరుగుతుం దన్నారు. చేతి వత్తులు, కుల వత్తులు చేసుకుంటూ జీవనం పొందే బిసి అభివద్ధి, పురోభివద్ధి తగ్గిపోయాయన్నారు. బీసీలు హక్కుగా పొం దాల్సిన సబ్ ప్లాన్ నిధుల నుండి స్థానిక సంస్థ ల్లో రిజర్వేషన్ల వరకు ప్రతి అంశంలో నిరాద ^రణకు, గురవుతు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, కార్పొరేషన్, సబ్ ప్లాన్ నిధుల్ని మళ్లించి బీసీలకు అన్యాయం చేశారన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్రమైన అన్యాయానికి గురవుతు న్నాం^న్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రద్దు చేసిన 10 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని, ఎంపిలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారులు, వైస్ ఛాన్సలర్‌లలో 34 శాతం బిసిలకు ఇవ్వాలని, చేనేతలకు సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలన్నారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులివ్వాలి. మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, పడవల పంపిణీ పునరుద్ధరించాలన్నారు. జీవో నెం. 217ను రద్దు చేయాలని, బిసిలకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు అందించే రాయితీలను పునరుద్ధరించాలన్నారు. బిసి స్టడీ సర్కిళ్లకు పూర్వ వైభవం కల్పించాలని, బిసి నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజి ప్రసంగించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిఎన్ విజయకుమార్, వైవి సుబ్బారావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, పెళ్ళూరు చినవెంకటేశ్వర్లు, టి.అనంతమ్మ, కొక్కిలిగడ్డ లక్ష్మి పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై సబ్ కలెక్టర్ విచారణ


వికలాంగ విద్యార్థితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-బేస్తవారిపేట

ఈ ఏడాది మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతు పేరూరి చిన్న వెంకటయ్య కుటుంబాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్ బుధవారం పరామర్శించారు. వెంకట య్య ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్గమ ధ్యంలో కొత్తపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఆయన పరిశీలించారు. అనం తరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఆయన విద్యార్థులతో కలిసి సహాపంక్తి భోజనం చేశారు. ప్రతి రోజు మెనూ పాటిస్తున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ కె శాంతి, ఎంపిడిఒ చెన్నకేశవ రెడ్డి, ఆర్ఐ అనిల్ కుమార్, ఎంఇఒ జింకా వెంకటేశ్వర్లు, విఆర్ఒ చిన్న ఖాశింసా, ప్రధానోపాధ్యా యుడు మోహన్ రావు ఉన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కాలంసుబ్బారావు

సిఐటియు జిల్లా మహాసభలను

జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈనెల 27,28 తేదీలలో చీమకుర్తిలో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కాలంసుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక దాచూరిరామిరెడ్డి భవనంలో జరిగిన సిఐటియు మండల కమిటి సమావేశానికి బి వీరాంజనేయులు అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో కాలంసుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేని, లేబర్ కోడ్స్‌లను తెచ్చి యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా అమ్మేస్తుందని విమర్శించారు. గ్రానైట్‌రంగంలో కార్మికులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకుండా ,గ్రానైట్ యజమానులు పెండింగ్ పెడుతున్నారన్నారు.పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు,జిల్లా నాయకులు పి వెంకటరావు,బి ఓబులేషు,ఆర్ ఆంజనేయరెడ్డి,ఈ నాగయ్య,ఏ యోహాన్,జి శంకర్,అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాబ్రీ మసీదు విధ్వంసం-లౌకికరాజ్యంపై స్టడీ సర్కిల్:

స్థానిక దాచూరిరామిరెడ్డి భవనంలో ఉద్యోగ,కార్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాబ్రీ మసీదు విధ్వంసం 30 ఏళ్ళు-లౌకికరాజ్యం అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కాలంసుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో యూటిఎఫ్ మండల అధ్యక్షులు ఎస్‌కె అక్బర్, జెవివి జిల్లా నాయకులు చలువాదిరమేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి టి రామారావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిశోధనలకు కాన్ఫరెన్స్‌లు అవసరం


పేస్ కళాశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దశ్యం.

ప్రజాశక్తి-టంగుటూరు

కళాశాలలలో తరచూ నిర్వహించే కాన్ఫరెన్స్‌లు పరిశోధనలకు ఎంతగానో దోహదపడతాయని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ముఖ్య అతిథి, సీనియర్ ఇంజనీర్ హజరత్ ఓలేటి అన్నారు. బుధవారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్స్‌డ్ ఇన్ కంప్యూటర్ ఎలక్ట్రికల్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ అంశంపై గత రెండు రోజులుగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్ ఓలేటి మాట్లాడుతూ స్మార్ట్ గ్రిడ్ సొల్యూషన్స్ సోలార్ పవర్ యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కాన్ఫరెన్స్‌లకు హాజరవ్వడం ద్వారా కొత్త కొత్త ఆలోచనలు జాగతం చేయవచ్చని చెప్పారు. చివరగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి కాన్ఫరెన్స్‌లకు తమ కళాశాల వేదికగా ఉండడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జీవీకే మూర్తి, స్టూడెంట్స్ డీన్ ఆర్ వీరాంజనేయులు, ఏఓ ఎం రమణబాబు, ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సిఎస్‌ఈ, ఎంబీఏ విభాగాధిపతులు బి నాగరాజు, ఎం రాజశేఖర్, మేరీ జోన్స్, కోఆర్డినేటర్లు కే శివారెడ్డి, బి వెంకటేష్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అంగన్వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-పొదిలి

నగర పంచాయతీ పరిధిలోని పొదిలమ్మ నగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని బుధవారం పొదిలి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి సుధా మారుతి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగన్‌వాడీలకు త్వరిగతిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

9లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-దరిశి

ఇంతవరకూ ఎమ్మెల్సీ ఓట్లు నమోదుచేసుకోనివారు ఈనెల 9వ తేది లోపు ఓట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో బుధవారం ఎమ్మెల్సీ ఓట్ల వివరాలను డిటి రవిశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు అర్హులైన వారందరూ ఓట్లు నమోదుకు దరఖాసుచేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు డి వెంకటరెడ్డి, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రామకోటిరెడ్డి, అధ్యక్షులు మీనిగ శ్రీను, రామ్మోహన్‌రెడ్డి, రామిరెడ్డిలు పాల్గొన్నారు.



కలెక్టర్‌చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

మాజీ సైనికుడికి పురస్కారం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామం మాజీ సైనికుడు సొంటం వెంకటరెడ్డికి కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మాజీ సైనికుల సేవా కేంద్రం అధ్యక్షుడు వెంకటరెడ్డి మాజీ సైనికులకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను దష్టిలో ఉంచుకొని ఆయనను ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఆర్మీ ఫోర్స్ ఫ్లాగ్ డే సందర్భంగా వెంకటరెడ్డికి ఎగ్జామ్నారీ పర్ఫామెన్స్ కండిషన్ ఆఫ్ ద సర్వీస్ కింద ఈ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

వెంగళాయపల్లిలో 'గడపగడపకూ'

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని వెంగళాయపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అర్హులైన వారందరికీ నవరత్నాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు శీలం సుదర్శనం, స్థానిక ఎంపిపి అత్యాల జఫన్య, ఇఓఆర్‌డి డి.నాగమల్లేశ్వరి, ప్రభుత్వ అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-దరిశి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి నాయకులు హనుమంతరావు, రమేష్‌లు కోరారు. బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రంగారావుకు వారు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

వెంగళాయపల్లిలో పారిశుధ్యపనులు

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని వెంగళాయపల్లిలో బుధవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు ఇఓఆర్‌డి డి.నాగమల్లేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా మురుగు కాలువలలోని చెత్తిచెదారాలను తొలగించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎంపిపి

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరే విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యన్ని విడి ప్రజల సమస్యలపై దష్టి సారించాలన్నారు. జడ్‌పిటిసి ఏర్వ చలమారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే విధంగా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దారవీడు ఎంపీటీసీ గొట్టం రాజనారాయణమ్మ మాట్లాడుతూ పంచాయతీలో నాలుగు రోజుల నుండి మంచినీటి ట్యాంకర్ల నిలిపి వేయడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో ఉన్న బోర్ల నుండి శివాలయం వద్ద పెద్దట్యాంకు, పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తే మంచినీటి సమస్య తీరుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి, ఎంపిడిఓ జి.రాజ్‌కుమార్, తహశీల్దార్ ఎంవి.క్రిష్ణారెడ్డి, ఎంఇఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగరాజు, వ్యవసాయశాఖ అధికారి బుజ్జిబాయి, ఉద్యానవనశాఖ అధికారి ఆదిరెడ్డి, ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ రవి, పశువైద్యాధికారి డాక్టర్ వీరనారాయణ, ఎపిఓ సాంబశివయ్య, ఎపిఎం శ్రీనివాసులు, అంగన్‌వాడి సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, హౌసింగ్ ఎఇ, డిఇ, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ జి.రాజ్‌కుమార్

సమస్యలను తెలుసుకునేందుకే వచ్చా

ఎమ్మెల్యే కందురు నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే మీ గ్రామానికి వచ్చానని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని మార్కాపురం శాసనసభ్యుడు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కొనకనమిట్ల పంచాయతీ పుట్లూరువారిపల్లెలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అర్హులైనవారికి పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే అధికారులతో మాట్లాడి ప రిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాగర్ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, అంతర్గత రోడ్లు బాగు చేయాలని పలువురు ఆయన దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచి సిగినం లక్ష్మీ తిరుపతమ్మ, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ జనార్దన్, ఏపిఎం గోపాలకష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, వెలుగొండ దేవస్థానం చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, నాయకులు సురవరపు పెద్దవెంకటరెడ్డి, కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి, పునుగోటి కొండారెడ్డి, యక్కండి తిరుపతిరెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు, కడెం ఆంజనేయులు, విఆర్‌ఓ రఘురామయ్య పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మెనూను ఖచ్చితంగా అమలు చేయాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ఖచ్చితంగా అమలుచేయాలని ఎంఇఒ పి ఆంజనేయులు అన్నారు. బుధవారం ఆయన యర్రగొండపాలెం మండలంలోని పందివానిపల్లి, బిళ్లగొందిపెంది, పోతురాజుపెంట, యల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వంటశాలలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో ఆంజనేయులు

భవ్యశ్రీ కి అభినందనలు..

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్.

గత నెల 25 నుండి 29వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ టోర్నమెంట్‌లో ఏపీ జట్టు తరఫున మండలంలోని మైనంపాడు హైస్కూల్ విద్యార్థిని భవ్యశ్రీ పాల్గొంది. ఈ పోటీలలో రాష్ట్ర జట్టు బంగారు పతకాన్ని సాధించింది. బుధవారం హై స్కూల్లో జరిగిన అభినందన సభలో పలువురు పాల్గొని జట్టు తరుపున ఆడి బంగారు పతకాన్ని సాధించిన భవ్యశ్రీ ని పలువురు అభినందించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.కె మహబూబ్ సుభాని, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు గుండవరపు సుబ్బారావు, పాఠశాల పిడికే వనజ, పిఇటి టీ రవికుమార్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు వారి ఆద్వర్యంలో బుధవారం నాగులుప్పలపాడు గ్రామంలో సాయిబాబా మందిరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు డాక్టర్లు రామాంజనేయులు, డాక్టర్ సునీల్ కంటికి, గుండెకు సంబందించిన వ్యాదులకు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేసారు మరియు బీపీ షుగర్ గుండె కిడ్నీ విష జ్వరాలు లాంటి వ్యాధులకు వైద్యులు , రోగులకు తగు జాగ్రత్తలు చెప్పారు. రోగ నిర్ధారణ జరిగిన వారికి ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ ,ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు.



మాలకొండయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మాలకొండయ్యకు నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పెట్లూరు పంచాయతీ పరిధిలోగల చవటపాలెం గ్రామానికి చెందిన వేముల మాలకొండయ్య (48) ట్రాక్టర్ తిరగబడి మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, దామచర్ల పూర్ణచంద్రరావులు బుధవారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చవటపాలెం గ్రామంలో టిడిపి పార్టీకి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, బత్తులనారాయణ స్వామి, నరసారెడ్డి, వేముల మల్లిఖార్జునరావునివాళులర్పించారు.

సెమీ క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 12వ తేదిన జరుగు సెమి క్రిస్మస్ వేడుకల వాల్ పోస్టర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉడుముల శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామావత్ అరుణ బాయి, పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధి నర్రెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కొప్పర్తి ఓబుల్ రెడ్డి, సయ్యద్ జబిబుల్లా, జిల్లా కో ఆప్షన్ మెంబర్ షాబీర్ భాష పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

కొండపి సచివాలయం-1 క్రింద కామేపల్లి రోడ్డులో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవ స్థానం దగ్గర నూతనంగా ఏర్పాటు చేసి రైతు భరోసా కేంద్రం గురువారం ఉదయం 9 గంటలకు వైకాపా కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించబడుతుందని వ్యవ సాయ అదికారి వి.రాము తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలపై పోరాటం తప్పదు

ప్రజాశక్తి-పామూరు

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యేటా వీరనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని కాపువీధి సెంటర్‌లో వ్యవసాయ కార్మిక జెండాను ఆయన ఎగరవేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ 8,9,10 తేదీలలో జంగారెడ్డిగూడెంలో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పేరమ్మ, పి. రత్నమ్మ, కనకమ్మలు పాల్గొన్నారు.

పశువైద్యశాల పరిశీలన

ప్రజాశక్తి - మద్దిపాడు

స్థానిక పశువైద్య శాలను బుధవారం జెడి బేబీరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా గేదెకు వైద్యపరీక్షలు నిర్వహించడం జరిగింది. అనంతరం మండలములోని పశు వైద్యశాల జరుగుతున్న తీరును గురించి స్థానిక ఏడి పులగర రామారావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది పురాలేశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

డిప్యూటీ తహశీల్దార్‌గా రాజేష్

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్.రాజేష్ పెద్దారవీడు మండల డిప్యూటి తహశీల్దార్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎఆర్‌ఐగా పని చేస్తున్న శ్రీనివాసులు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. వీరికి అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి : వ్య.కా.సం

ప్రజాశక్తి -బల్లికురవ

ఈ నెల 8,9,10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బల్లికురవ గ్రామంలో మహాసభలకు వాల్ పోస్టర్లను వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మిగులు బంజర భూములు లక్షలాది ఎకరాలు ఉన్నట్లు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కోనేరు రంగారావు కమిటీ తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి మూడు ఎకరాల భూమిని పంచడానికి మిగులు భూములు ఉన్నాయని ఆ కమిటీ తేల్చినట్లు తెలిపారు అర్హులైన పేదలకు మిగులు బంజరు భూములను పంపిణీ చేయాలని కోరారు. బల్లికురవ మండలంలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఆసైడ్, డీకే భూములు అన్యాక్రాంతమై పెత్తందారుల ఆక్రమణంలో ఉన్నాయని తెలిపారు. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి పేదలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ గొల్లపూడి అంజయ్య, మండల కమిటీ సభ్యులు బి.వీరయ్య కత్తి రాధా తదితరులు పాల్గొన్నారు. **పంగులూరు:** పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయిని వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ పూసపాటి సుబ్బరాజు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బైటమంజులూరు దళితవాడలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను చింతల బోసు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు సమస్యలపై పోరాడాలన్నారు. సంఘ నాయకుడు, రామచంద్ర రాజు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో వివక్షకు వ్యతిరేకంగా, భూమికోసం, కూలి కోసం, ఇళ్ల స్థలాల కోసం, పింఛన్ల కోసం, అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కయ్యాల ఇశ్రాయేలు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సైన్సు క్లబ్‌లతో విద్యార్థులలో స్ఫూర్తి పెంపు

ప్రజాశక్తి - పంగులూరు

యువత సైన్సు పట్ల ఆకర్షితులు అయ్యేలా పాఠశాల స్థాయి నుంచే వారిలో వినూత్న స్ఫూర్తిని పెంపొందించడం కోసం గీతా సర్వీస్ ట్రస్టు ద్వారా యంగ్ సైంటిస్ట్ క్లబ్ ఏర్పాటు ఆనందంగా ఉందని గీతా సర్వీస్ ట్రస్టు చైర్మన్ వలివేటి మురళి తెలిపారు. మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా ట్రస్టు చైర్మన్ వలివేటి మురళి సైన్సు క్లబ్‌ను ప్రారంభించారు. అనంతరం మురళీ మాట్లాడుతూ సైన్సు క్లబ్ ద్వారా ప్రతిభ ఆధారంగా 60మంది విద్యార్థులకు సైన్సు, టెక్నాలజీపై అవగాహన పెంపొందించి వారి ద్వారా కొత్త ఆవిష్కరణలు చేయించేందుకు క్లబ్ సహాయ సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. జిస్ట్ క్లబ్బుల ద్వారా చేపట్టే కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, విలువైన పుస్తకాలు, సైన్స్ యాక్టివిటీ కిట్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి , గీత సిబ్బంది పద్మసుధ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు కె. సోమశేఖర్, సిహెచ్. లక్ష్మీనారాయణ, కె. యోహాన్, ఎన్. సుధా వాణి పాల్గొన్నారు. **ఇంకొల్లు రూరల్ :** యువత సైన్సు పట్ల ఆకర్షితులు అయ్యేఆలా పాఠశాల స్థాయి నుంచే వినూత్న స్ఫూర్తిని పెంపొందించడం కోసం గీతా సర్వీస్ ట్రస్టు యంగ్ సైంటిస్ట్ క్లబ్ స్థాపించటం ఆనందంగా గీతా సర్వీస్ ట్రస్టు చైర్మన్ వలివేటి మురళి తెలిపారు. మండల పరిధిలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గిరిజ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గీతా ట్రస్టు చైర్మన్ వలివేటి మురళి సైన్సు క్లబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు శివకుమారి, హనుమంతరావు, రమేష్ బాబు తదితరులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెమోంట్‌లు అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రంలో రాక్షస పాలన : ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తుందని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్ధతను ఎండకట్టలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో బుధవారం జరిగిని ఓ ప్రయివేటు కార్యక్రమంలో ఆనందన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని, నిత్యావసర ధరలు విద్యుత్ ఛార్జీలు పెరిగి పేద మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాకా శేషుబాబు,యడ్ల జయసిలరావు, మాచర్ల నాగరాజు,అనగాని ఏడుకొండలు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : తహాశీల్దారు

ప్రజాశక్తి-మార్టూరు

జగనన్న కాలనీల్లో గహ నిర్మాణాలు త్వరతిగతిన పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలని తహాశీల్దారు వెంకట శివరామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వలపర్ల గ్రామా పంచాయతీ కార్యాల యంలో లబ్ధి దారులకు, వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా తహాశీల్దారు మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలకు జగనన్న కాలనీలో నిర్మించే గహాలు వెంటనే పూర్తి చేసేలా లబ్దిదారులకు అవగాహన కల్పిం చాలన్నారు. అనంతరం వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం రాజారత్నం ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే రూ. 35 వేల నగదు మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గరికపూడి నితిన్, పంచాయతీ కార్యదర్శి మోటుపల్లి శిరీషా, వెలుగు సిబ్బంది త్రివేణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహాశీల్దారు

గొట్టిపాటి నరసింహారావుకు నివాళి

ప్రజాశక్తి యద్దనపూడి

యద్దనపూడిలో మాజీ మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసింహారావు 9వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు కుమారుడు, వైసిపి యువ నాయకుడు గొట్టిపాటి భరత్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రి పేదవారికి అండగా ఉండేవారని తాను కూడా వారికి అండగా ఉంటానని అన్నారు. తన తండ్రి ఆశయాలు కొనసాగిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నరసింహరావు భార్య పద్మావతి, కుమార్తె లక్ష్మి, గ్రామ సర్పంచి వలేరు రేణుక బాలకోటేశ్వరరావు, జాగర్లమూడి మాజీ సర్పంచి పోతిరెడ్డి, మండల నాయకులు ఎం. రాంబాబు, గన్నవరం ఎంపిటిసి సతీష్ కుమార్, బసివి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న గొట్టిపాటి భరత్, వైసిపి నాయకులు

అభివృద్ధి పనులకు ప్రణాళికలు : ఎంఇఓ

ప్రజాశక్తి- మద్దిపాడు

గ్రామాలలో అభివృద్ధి పనులు కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఎంఇఓ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో 2023–2024 ఆర్థిక సంత్సరంలో అభివృద్ధి చేపట్టేందుకు ప్రణాళికల తయారీపై సర్పంచులు, కార్యదర్సులు సచివాలయం సిబ్బందికి బుధవారం శిక్షణ తరగతులు నిర్వాహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారీ చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి తగు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామస్తులందరీ సహకారంతో అభివృద్ధి పనులను గుర్తిచాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఎఒ చుండూరి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఓ

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -చిన్నగంజాం

మండల పరిధిలోని చిన్నగంజాం గ్రామంలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరి సాంబ శివరావు మాట్లాడుతూ రాబోయే కాలంలో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలు అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న 'ఉత్తరాంధ్ర పొలికేక సభ'

ప్రజాశక్తి-రేపల్లె

దళిత,గిరిజన,బహుజన మైనార్టీ ప్రజలపై జరుగుతున్న దాడులు హత్యలు అత్యాచారాలను ప్రతిఘటిస్తూ జైభీం భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 10న విశాఖపట్నం ఆర్‌కె బీచ్ వద్ద ఉత్తరాంధ్ర పొలికేక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రేపల్లె నియోజక వర్గ కన్వీనర్, న్యాయవాది దోవా రమేష్ తెలిపారు. గిరిజనుల భూములు స్వాధీనం,కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, రద్దుచేసిన ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలని కోరుతూ పొలికేక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దళిత,గిరిజన, బహుజన మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా శివనాగేశ్వరరావు

ప్రజాశక్తి-పర్చూరు

హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా పర్చూరుకు చెందిన తులసి శివ నాగేశ్వరరావు నియ మితులయ్యారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ నుంచి బధవారం నియామక పత్రాన్ని అందు కున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సి హెచ్.శ్రీకాంత్‌కు శివనాగేశ్వరరావుకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అధికారులతో సమావేశం

అమతలూరు : పేదలందరికీ ఇళ్లు,ఇతర అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహిస్తున్న ఎంపిడిఒ మహబూబ్ సుభాని తెలిపారు. ఈ సమావేశం వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ బి..అర్జునరావు అధక్ష్యతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పేదలందరికీ గృహాలు, మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టాల్సి అభివృద్ధిపై సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిడిఒ, తహాశీల్దారు, అన్ని శాఖల అధికారులు తగుప్రకాణాళికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. గృహనిర్మాణాలకు సంబంధించిన అన్ని వివరాలతో తప్పని సరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

మళ్లీ మీరే ఎమ్మెల్యేగా ఉండాలి

'గడపగడపకూ మన ప్రభుత్వం'లో బాలినేనితో కాలనీవాసులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'మీ ప్రభుత్వ పాలన బాగుంది. సిఎం జగన్ మోహన్‌రెడ్డి బాగా పని చేస్తున్నారు. మాకు ఏ పథకాలు కావాలన్నా వాలంటీర్లు, సచివాలయం వాళ్లు వచ్చి అందిస్తున్నారు. ఎక్కడా తిరగాల్సిన పనిలేకుండా అన్నీ ఇంటి దగ్గర నుంచే పనులు చేసి పెడుతున్నారు. మా కార్పొరేటర్ మాకు ఏం కావాలో అడిగి తెలుసుకుంటున్నారు. మళ్లీ మీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలి. మీరే ఎమ్మెల్యేగా ఉండాలి' అని స్థానిక లాయర్‌పేట రాజీవ్‌నగర్‌కు చెందిన పలువురు నివాసితులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో వ్యాఖ్యానించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం నగరంలోని 34వ డివిజన్ లాయర్‌పేట, రాజీవ్‌నగర్, సుజాతనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలన మీద, సంక్షేమ పథకాల మీద వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్‌లో వెంకట్రావు, సుజాత దంపతులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా మేం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు సచివాలయాల్లో వాలంటీర్లే వచ్చి ఇళ్ల వద్దనే అన్ని పనులూ చేసి పెడుతున్నారని, మరలా మీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని బాలినేనితో అన్నారు. ప్రభుత్వ పనితీరుపై సానుకూల స్పందన రావడంతో బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, 34వ డివిజన్ కార్పొరేటర్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, ఇంజినీర్ కె.మాల్యాద్రి, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

విజయవాడకు ప్రత్యేక బస్సు

జయహో బీసీ మహాసభ పేరుమీద విజయవాడలో జరుగుతున్న సభకు ఒంగోలు నుంచి పలువురు బీసీ నాయకులు, కార్యకర్తలు బుధవారం బయలుదేరి వెళ్లారు. వైసిపి జిల్లా కార్యాలయం వద్ద నుంచి విజయవాడకు బయలు దేరిన ప్రత్యేక బస్సులను బాలినేని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కటారి శంకర్ పాల్గొన్నారు.



పశువైద్యసేవలను పరిశీలిస్తున్న డాక్టర్ బేబీరాణి

పశువైద్యశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు

కరవది గ్రామీణ పశువైద్యశాలను పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.బేబీరాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పశు పోషకులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో గోకుల్ మిషన్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న జాతీయ పడ్డ దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీపై గడ్డి విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా, గడ్డి కత్తిరించు యంత్రాలు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. హాస్పిటల్ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఉలిచి పశు వైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.ప్రతిమ, కరవది గ్రామీణ పశువైద్యశాల నుంచి కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఓటర్ల జాబితా నుండి అనర్హులను తొలగించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలలో అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని జిల్లా రెవెన్యూ అధికారి బిసిహెచ్ ఓబులేసును పలు సంఘాల నాయకులు కోరారు. ఈవిషయమై డిఆర్ఒను బుధవారం రాత్రి కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పు రాయలసీమ(చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) టీచర్లు మరియు పట్టభద్రుల ఓటర్ల జాబితాలను గత నెల 23న ప్రకటించారని, ఆ ఆజాబితాలలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో 244మంది అనర్హులు ఉన్నారన్నారు. మూడు సంవత్సరాల సర్వీస్ లేనివారు, డైస్ ఫామ్స్ పేరు లేనివారు, పాఠశాల పేరు కూడ రాయని వారు ఇందులో ఉన్నారని తెలిపారు. స్పందించిన డిఆర్ఒ ఈ విషయమై విచారణ జరిపి అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. డిఆర్ఒను కలిసిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యదర్శి జి. శేషయ్య, సి.హెచ్. రాంబాబు, టివిఆర్ సుబ్బారావు ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఐదు రోజుల నుంచి జరిగిన శిక్షణా కార్యక్రమం ముగిసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూదనగుంట కోటేశ్వరరావు, డాక్టర్ ఎం.ఆంజనేయులు తెలిపారు. శిక్షణ పొందిన జట్టు ఈనెల 8 నుంచి 11 వరకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులో జరిగే అంతర్ జిల్లా సీనియర్ స్త్రీ, పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. స్త్రీ, పురుషుల జట్లకు ఒంగోలు శ్రీ మౌర్య మెడికల్ స్టోర్స్ కిట్లను బహూకరించారు. ఐదురోజుల శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ జి.ధనుంజయరావు, కోచ్ జె.సునీల్ పర్యవేక్షించారు. శ్రీ మౌర్య మెడికల్ స్టోర్స్ అందజేసిన కిట్లను డిఎస్ ప్రభుత్వ మహజళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.కళ్యాణి, క్రీడాకారిణులకు అందజేశారు. కార్యక్రమంలో జి.ధనుంజయరావు, ఎం.ఆంజనేయులు, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

హెచ్‌సిజి ఎంఎన్ఆర్

క్యాన్సర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహణ
- సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వై.రామకృష్ణారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్‌లో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. చీరాలకు చెందిన 55 ఏళ్ల చౌడేశ్వరి స్వరపేటిక క్యాన్సర్‌తో బాధపడుతుండగా... సకాలంలో గుర్తించి.. స్వరపేటికను తొలగించి.. తిరిగి మాట్లాడటానికి టిఇపి వాయిస్ ప్రొస్తసిస్ అనే పరికరాన్ని అమర్చారు. ఈ సందర్భంగా బుధవారం హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వై.రామకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు.

బాపట్ల జిల్లా, వేటపాలెంకు చెందిన చౌడేశ్వరి స్వరం మారడం, శ్వాస తీసుకోలేకపోవడం వంటి సమస్యలతో తమను సంప్రదించగా స్వరపేటిక క్యాన్సర్‌గా గుర్తించామన్నారు. చికిత్సలో భాగంగా ముందుగా ఐదు వారాలు రేడియేషన్ థెరపీ అందించామన్నారు. కానీ 8 నెలల వ్యవధిలో తిరిగి క్యాన్సర్ రావడంతో తదుపరి చికిత్సలో భాగంగా స్వరపేటికను తొలగించామని చెప్పారు. ఈ విధమైన శస్త్రచికిత్సను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొట్టమొదటిసారిగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కృత్రిమంగా అమర్చిన పరికరం ద్వారా రోగి స్పష్టంగా మాట్లాడగలుగుతున్నారని చెప్పారు. ఈ శస్త్రచికిత్సను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా నిర్వహించామని తెలిపారు. సకాలంలో ఆధునిక వైద్యం అందించి.. తాను మాట్లాడగలిగేలా చేసిన వైద్యులకు చౌడేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఒఒ డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్న ఏకైక హాస్పిటల్ తమదేనని, అన్ని రకాల క్యాన్సర్లకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ రఘునందన్, ఆరోగ్యశ్రీ డిసి డాక్టర్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో పరిశ్రమల స్థాపన, అభివద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు, అభివద్ధిపై జిల్లాస్థాయి కమిటి ద్వితీయ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్లో జరిగింది. పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులు, వనరులున్న బాపట్ల జిల్లాను పారిశ్రామిక రంగంగా అభివద్ధి చేయాలని అధికారులకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. నూతనంగా ఏ.పి.ఐ.ఐ.సి.లో పరిశ్రమలు స్థాపించడానికి 11 ప్లాట్ల మంజూరుకు జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. వివిధ ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటుపై ప్రాథమిక సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో చీరాల ప్రాంతంలో 11 పరిశ్రమలు ఏర్పడతాయన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు తీరుపై కలెక్టర్ సమీక్షించారు. తీరప్రాంతం అధికంగా ఉన్నందున ఆక్వాసాగు వృద్ధి కోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిజాంపట్నం హార్బర్ అభివద్ధి జరుగుతున్నందున భవిష్యత్తులో మత్స్యసంపద అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో పరిశ్రమలు, ప్రొసెసింగ్ యూనిట్లు స్థాపించేవారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పూర్తి అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. బాపట్లలో భావపురి రైస్ క్లస్టర్ ఫౌండేషన్, చీరాలలో శ్రీ శంకర మెడికల్ హెల్త్ కేర్ సంస్థ స్థాపనకు సంబంధించిన అనుమతులపై కలెక్టర్ చర్చించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జి.ఎమ్. మదన్మోహన్, ఏ.పి.ఐ.ఐ.సి. జడ్.ఎమ్. గోపికష్ణ, ఎల్.డి.ఎమ్. కృష్ణానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

మహిళపై అత్యాచారం జరగలేదు: ఎస్ఐ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో మతిస్థిమితం లేని మహిళపై అత్యాచార యత్నం జరిగి ఉండచ్చని కొద్దిమంది నుండి అనుమానం వ్యక్తమైన కారణంగా.. సదరు మహిళకు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో తగిన పరీక్షలు చేయించామని, ప్రభుత్వ వైద్యులు ఆమెను పరీక్షించి తెలిపిన మేరకు ఆమెపై ఎటువంటి అత్యాచారం జరగలేదని, ఆమె మానసిక స్థితి సరిగ్గా లేదని ధ్రువీకరించారని మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎ.శశికుమార్ తెలిపారు. మార్కాపురం పట్టణం కోర్టు సెంటర్‌లో మతిస్థిమితం సరిగ్గా లేక, తన పేరు వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్న మహిళను గుర్తించిన మార్కాపురం పోలీస్ వారు మధ్యవర్తుల సమక్షంలో ఆమెను విచారించారన్నారు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేనందున, ఆమెను మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సదరు మహిళను వైద్యుల ధ్రువీకరణ మరియు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు వైజాగ్‌లోని ప్రభుత్వ వైద్యశాల అయిన మెంటర్‌కేర్‌కు పంపామని చెప్పారు.



ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోరాటాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలు ఒంగోలులో బుధవారం ప్రారంభమయ్యాయి. మహాసభలకు ముందుగా ఏఐటియుసి సీనియర్ నాయకులు అందే నాసరయ్య ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఒంగోలు పట్టణంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిర్ల కృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ ప్రస్తుతం కార్మికులు అనుభవిస్తున్న హక్కులు చట్టాలు ఆషామాషీగా రాలేదని, ఎందరో త్యాగధనుల పోరాటాల ఫలితమేనన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ పాల్గొన్నారు.

రోడ్లపై డ్రమ్ములను రాత్రి తొలగించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రోడ్డుప్రమాదాలు నివారించడానికి రహదారులపై ఏర్పాటు చేసిన డ్రమ్ములను ప్రతిరోజూ రాత్రి 10 గంటలకు తొలగించాలని, చీటింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని ఎస్‌పి వకుల్‌జిందాల్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. బాపట్ల, చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో విడివిడిగా బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.మహేష్, డిసిఆర్‌బి డిఎస్‌పి జి.లక్ష్మయ్య, చీరాల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పి.శ్రీకాంత్, బాపట్ల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు , సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకష్ణ పాల్గొన్నారు.